క్లుప్తంగా

కమిషనర్‌కు జియ్యాని సత్కారం



కమిషనర్ సంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను బుధవారం నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌గా పదోన్నతిపై అమరావతి వెళ్తున్న ఆయన్ను బుధవారం జీవీఎంసీ కార్యాలయంలో శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. నగర సుందరీకరణ, పారిశుధ్యం, ప్లాస్టిక్ నియంత్రణ వంటి కార్యక్రమాలు నిర్వహించి తమకు ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సభ్యులు, అంబేడ్కర్ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన



నిర్మాణ పనుల్లో పాల్గొన్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్, గుల్లలపాలెం ప్రాంతాల్లో కాలువ నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ గులిగిందల లావణ్య శంకుస్థాపన చేశారు. గుల్లలపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గుల్లలపాలెం, రామ్‌నగర్ ప్రాంతాల్లో పెద్ద కాలువలు ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. వీరి సమస్యను జీవీఎంసీ ఉన్నతధికారుల దృష్టిలో పెట్టి సుమారు రూ.40 లక్షల వ్యయంతో ఇక్కడ కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గులిగిందల కృష్ణ, మమత, గొందేశి సత్యనారాయణ, సాల్మన్‌రాజు, పిలక రమణ, కృష్ణమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ల వితరణ



హెచ్‌ఎంకు ఫ్యాన్లు అందిస్తున్న మహిళా సంఘం నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు జనతా కాలనీకి చెందిన జనతా మహిళా సేవా సంఘం సభ్యులు సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు ఎం. విమల మాట్లాడుతూ పాఠశాలలో ఫ్యాన్లు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ విషయం తమ దృష్టికి తీసుకు రావడంతో సీలింగ్ ఫ్యాన్లతో పాటు పుస్తకాలు ఇతర వస్తువులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, మహిళా సంఘం సభ్యులు బి. రమాకుమారి, డి. శివలక్ష్మి, అరుణ, జ్యోతిప్రద, జమున, స్థానిక పెద్దలు ఎం. అప్పలనాయుడు, ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏయూ విభాగాల పరిశీలన

విశాఖ విద్య : ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు బుధవారం విద్యాలయంలో గల విద్య, తత్వశాస్త్రం, ఇంగ్లిష్, లైబ్రరీ – ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, సంస్కృతం, ఆంత్రోపాలజీ తదితర విభాగాలను సందర్శించారు. అక్కడ తరగతులు జరుగుతున్న తీరును నేరుగా పర్యవేక్షించారు. అదేవిధంగా ఆయా విభాగాల్లో నిర్వహిస్తున్న సెమిస్టర్ పరీక్షలను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు ఆ పార్కు పచ్చదనంతో కళకళలాడేది . చిన్నారుల ఆటలలో సందడిగా ఉండేది. పెద్దలు వాకింగ్‌తో కాలక్షేపం చేసేవారు. వారాంతాల్లో అయితే ఉదయం, **సాయంత్రం పండగ వాతావరణం కనిపించేది.**

నేడు పిచ్చి మొక్కలు,ఎండిన కొమ్మలతో పార్కు నిండింది. తుప్పు పట్టిన ఆట పరికరాలతో కళావిహీనంగా మారింది. చిన్నారులకు ఆహ్లాదం కరువైంది. దీని ఆలనాపాలనా చూసే నాథుడు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం **అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

ఆహ్లాదం కనుమరుగు!

- నిరుపయోగంగా మారిన చిల్డ్రన్ పార్కు
- తుప్పు పట్టిన ఆట వస్తువులు
- పిచ్చి మొక్కలతో నిండిన పార్కు ఆవరణ
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పార్కు ఆవరణలో పడేసిన చెట్టు కొమ్మలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులో ఆహ్లాదానికి చోటు కరువైంది. కాలనీ వాసులతో పాటు పిల్లల కోసం సుమారు 10 సెంట్ల విస్తీర్ణంలో చిల్డ్రన్ పార్కు నిర్మించారు. పార్కులో అడుగు పెడితే పచ్చదనం స్వాగతం పలికేది. అందమైన మొక్కలు,అధునాతన విద్యుత్ వెలుగులతో ఆహ్లాదం పంచేది. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నా పెద్దా అంతా సందడి చేసేవారు. పిల్లలు ఆటపరికరాలతో గడిపితే.. పెద్దలు ఆరోగ్యం కోసం వాకింగ్, చిన్న చిన్న వ్యాయామాలు చేసుకునేవారు.సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అయితే కాలనీ పరిధిలోని చిన్నారులు,వారి తల్లిదండ్రులతో పాటు వచ్చి ఉత్సాహంగా గడిపేవారు. తల్లిదండ్రులు పలకరింపులు.. సరదా కబుర్లతో పార్కు అంతా సందడిగా ఉండేది. నేడు పార్కు ఆలనా పాలనా పట్టించుకునే వారు లేకపోవడంతో పార్కు ముఖ ద్వారంలో ఉన్న ఇనుప గేటు అదృశ్యం అయింది. పిల్లల ఆట వస్తువులు పూర్తిగా తుప్పు పట్టి ఉన్నాయి. పార్కు ఆవరణ అంతా పిచ్చి మొక్కలు,ఎండిన చెట్టు కొమ్మలు దర్శనం ఇస్తున్నాయి.దీంతో కాలనీ వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



పార్కు ముఖద్వారంలో గేటు స్థానంలో చెట్టు కొమ్మలు



తుప్పు పట్టిన పిల్లల ఆట వస్తువులు

ఆకతాయిల అడ్డా..

అంతే కాక రాత్రి సమయంలో కొంత మంది ఆకతాయిలు పార్కులోకి ప్రవేశించి మద్యం,ధూమపానం సేవించడం వంటివి చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.అధికారులు స్పందించి పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలని వారు కోరుతున్నారు.

చాలా అసౌకర్యంగా ఉంది



గతంలో పార్కులోకి ప్రవేశిస్తే ఎంతో ఆహ్లాదంగా ఉండేది.నేడు చాలా ఇబ్బంది కరంగా ఉంది. కాలనీ పిల్లలు ఆడుకోవడానికి సరైన పార్కు లేక పోవడంతో వారు రోడ్లపై ఆడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారులు, పాకులు స్పందించి పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలి.
– సాంబశివరావు, కాలనీ వాసి

ఆకతాయిలు చేరుతున్నారు



పార్కు ప్రస్తుతం కళావిహీనంగా ఉంది. దీంతో ఆకతాయిల అడ్డగా మారింది.రాత్రి సమయంలో కొంత మంది చేరి మద్యం, ధూమపానం వంటివి చేస్తున్నారు. దీన్ని ఇలాగే వదిలేస్తే భవిష్యత్‌లో మరింత ఇబ్బంది కరంగా మారుతుంది.అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలి.
– హరీష్‌కుమార్, కాలనీ వాసి

నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల స్వాధీనం



గోపాలపట్నంలో ఓ దుకాణం వద్ద నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

గోపాలపట్నం: నగరంలో పాలిథిన్ వినియోగాన్ని నిషేధించిన నేపథ్యంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం సాయంత్రం గోపాలపట్నం రైతు బజారు ప్రహరీకి ఆనుకుని ఉన్న దుకాణాలతో గోపాలపట్నం హైస్కూల్ దిగువ రోడ్డులో ఉన్న దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఆయా దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ సంచులు, పేపర్ గ్లాసులు వంటివి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు తరచూ జరుగు తాయని.. ప్లాస్టిక్ సంచులు వాడవద్దని సచివాలయ శానిటరీ కార్యదర్శి శ్రీనివాసరావు హెచ్చరించారు. భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వార్డులో పర్యటిస్తున్న వార్డు కార్పొరేటర్ చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా పర్యటించారు. వార్డులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, ఎలక్ట్రికల్ స్తంభాల ఏర్పాటు వంటి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అన్ని ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట రమణ, సతీష్, తులసి, అనిత తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యంతో ఆటలు తగవు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యంతో యాజమాన్యం ఆటలు ఆడుకోవడం తగదని ఉక్కు శ్రామిక సంఘం ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు అన్నారు. బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం సర్వీసులో ఉండగా తమ ఆరోగ్యాన్ని త్యాగం చేశారన్నారు. అందులో భాగంగా అనేక రోగాలు తెచ్చుకోవాల్సి వచ్చిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం నాటి యాజమాన్యాలు పోస్టు రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ ప్రవేశపెట్టాయన్నారు. రూ.1300 చొప్పున భార్యభర్తలకు ప్రీమియం ఏర్పాటు చేసి ఏడాదికి రూ. 3 లక్షలు వైద్య పొందే సదుపాయం ఉండేదన్నారు. అదే విధంగా అవుట్ పేషంట్‌గా రూ. 8 వేలు బిల్లు పొందే అవకాశం కల్పించారన్నారు. అయితే యాజమాన్యం ఆ ప్రీమియంను 8 రెట్లు పెంచేసి ఏకంగా రూ. 10 వేలు చొప్పున కట్టాలని కొత్త స్కీం తేవడం దుర్మార్గమన్నారు. ఏడాదికి భార్యాభర్తలు రూ. 20 వేలు చెల్లించాలంటే ఆ ఉద్యోగికి వచ్చే పెన్షన్ మెడికల్ ప్రీమియంకే సరిపోతుందన్నారు. వెంటనే యాజమాన్యం కొత్త స్కీమ్‌ను ఉపసంహరించి పాత మెడికల్ స్కీమ్ కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరెడ్డి, కరణం సత్యారావు, బొడ్డు రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని ప్రకటించే వరకూ పోరాటం ఆగదు



శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని, ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని, అప్పటి వరకు ఉద్యమాలు, ఆందోళనలు ఆగవని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వి.శ్రీనివాసరావు, బీఎస్‌రాజు, రమణమూర్తి, డి.వి.రమణారెడ్డి, కారు రమణ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో మంగళవారం చేపట్టిన 1441వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 2021 జనవరి నాటికి రూ.28వేల కోట్ల టర్నోవర్, రూ.940 కోట్ల నికర లాభంతో నడుస్తున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వ విధ్వంసకరమైన కుట్రలు, కుతంత్రాలతో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడిచే శక్తి ఉన్న విశాఖ ఉక్కను 1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తికి దిగజార్చిందని ఆరోపించారు. ప్రభుత్వాల తీరు కత్తితో పొడిచి ఆయింట్‌మెంట్ పూసినట్టు ఉందని, ఈ ప్యాకేజీ కూడా ఇదే కోవకు చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకొనేలా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒప్పించాలని, ఆ బాధ్యత తీసుకుంటామని, ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారని, విస్మరిస్తే ప్రజలు క్షమించబోరన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, రాపాటి కోటేశ్వరరావు, సీహెచ్.సన్యాసిరావు, పోతయ్యరెడ్డి, నగేష్, సత్యారావు, అప్పలరెడ్డి, జగదీష్‌కుమార్, పోలీస్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆదర్శంగా మెలగాలి

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రభుత్వ విప్ పి.గణబాబు బుధవారం ప్రారంభించారు.నాడు– నేడు కార్యక్రమంలో భాగంగా సుమారు 2 కోట్లతో నాటి ప్రభుత్వం పాఠశాలను నిర్మించింది. అయితే పాఠశాల వినియోగంలోకి వచ్చి సుమారు 7 నెలలు కావస్తున్నా ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు.ఎట్టకేలకు బుధవారం ముహూర్తం కుదరడంతో ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఆదర్శంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్,నాయకులు పుర్రె సురేష్‌యాదవ్, ములగాడ మండల విద్యా అధికారి వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకుమారి, జనసేన నాయకురాలు అంగ దుర్గాప్రశాంతి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గణబాబు,కార్పొరేటర్ పూర్ణశ్రీయాదవ్

రెడ్‌క్రాస్ షెల్టర్ పరిశీలన

బీచ్‌రోడ్డు : పెదవాల్తేరు దళాయివారి వీధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హోమ్‌లెస్ షెల్టర్‌ను బుధవారం పలువురు అధికారులు సందర్శించారు. ఎన్‌యూఎల్‌ఎం (నేషనల్ అర్బన్ లైవ్ మిషన్) జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రాతోపాటు అదే విభాగానికి చెందిన మాగోల్యామ్, యూసీడీ పీడీ సత్యవేణి, ఏపీడీ రాము, జోనల్ కార్యాలయ సిబ్బంది షెల్టర్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. షెల్టర్ నిర్వాహకుడు మురళిని అభినందించారు. జీవీఎంసీ 22వ వార్డు పరిధి శివాజీపాలెంలోని స్లమ్ సమాఖ్యలతో ముఖాముఖి కార్యక్రమాన్ని రూపా మిశ్రా నిర్వహించారు. సమాఖ్య సభ్యుల పనితీరు, సభ్యుల వ్యాపార, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డు కార్మికులకు వైద్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షల కోసం వచ్చిన కాంట్రాక్ట్ కార్మికులు

సింధియా: ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సహకారంతో హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఆక్యుపేషనల్ హెల్త్ సెంటర్ ఆవరణలో సుమారు 274 మంది కాంట్రాక్ట్ కార్మికులకు బుధవారం వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మూడు నెలలగా మొత్తం 1000 మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు సంస్థ యాజమాన్యం తెలిపింది. కార్మికుల ఆరోగ్య భద్రత, వారి శ్రేయస్సు కోసం సంస్థ కట్టుబడి ఉంటుందని షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి తెలిపారు.

బాలికలను అన్ని రంగాల్లో ఎదగనిద్దాం

- ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

సీతమ్మధార : బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి ఎదగనిస్తేనే జాతీయ బాలికా దినోత్సవానికి అర్థముంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో) ఎం.వి.రమణ కుమారి, ఏసీడీపీవో శ్రీలత ఆధ్వర్యంలో మహారాణిపేట మండల స్థాయి మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, స్కూల్ నోడల్ టీచర్లు, విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి రేసపువానిపాలెం సామాజిక భవనంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమార దశ పిల్లల ఆరోగ్యం, అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. ఇంకా బాల్య వివాహాలు జరుగుతూనే ఉండడం విచారకరమన్నారు. వీటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కోరారు. సీడీపీవో ఎం.వి.రమణ కుమారి మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా క్లిష్టమైందన్నారు. మెడికల్ ఆఫీసర్ మన్మోహన్, అప్ హోల్డ్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజ్ పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలలో చేపట్టాల్సిన చర్యలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిటైర్డు చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణవేణి, ఒన్ స్టాప్ సెంటర్ ఇన్‌చార్జి శరణ్య, సూపర్‌వైజర్లు సెల్వియా, వెన్నిసా సుందరి, కుమారి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా శ్రీనృసింహ హోమం



ప్రధాన కలశాన్ని, శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడషోపచార పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కనులపండువగా మరిడిమాంబ తీర్థం



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు , పూజలందుకున్న మరిడిమాంబ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వాసుల గ్రామదేవత మరిడిమాంబ (కాకి అప్పన్న) పరస బుధవారం కనుల పండువగా సాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి భక్తులు బారులు తీరారు. ప్రభుత్వ విప్ పి.గణబాబు, నాయకులు కాకి పోలిరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా మల్కాపురం పుర వీధుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పిల్లలు పలు ఆటల పరికరాల వద్ద సందడి చేశారు.



సరదాగా ఆడుతున్న చిన్నారులు

ప్రమాదమని తెలిసినా..

కేబుల్ వైర్లపై దుస్తులు ఆరబెడుతున్న మహిళలు



ప్రకాష్‌నగర్‌లో ఇంటి ముందు వైర్లపై ఆరబెట్టిన దుస్తులు



ఇండస్ట్రియల్‌కాలనీకి వెళ్లే మార్గంలో..

మల్కాపురం: ప్రమాదం అని తెలిసినా కొంత మంది మహిళలు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.విద్యుత్ వైర్లకు ఆనుకుని ఉన్న కేబుల్ వైర్లపై తడి వస్త్రాలు ఆరబెడుతూ ప్రమాదాన్ని కొని తెచ్చుకునే విధంగా వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ ఏడుగుడుల సెంటర్ నుంచి ఇండస్ట్రియల్‌కాలనీకి వెళ్లే మార్గంలో భవనాలకు ఆనుకుని విద్యుత్ ఎల్‌టీ,కేబుల్ వైర్లు ఉన్నాయి. ఈ రెండు వైర్లు దగ్గరగా ఉంటాయి.అయితే ఈ భవనాల్లో ఉంటున్న వారు శుభ్రం చేసే వస్త్రాలను (తడి దుస్తులు) ఇక్కడ విద్యుత్ ఎల్‌టీ లైనుకు సమీపంలోని కేబుల్ నెట్ వర్క్ వైర్లపై వేస్తున్నారు. పొరపాటున తడి వస్త్రాలు విద్యుత్ వైర్లకు తగిలితే ప్రమాదమూ సుమా.. తస్మాత్ జాగ్రత్త..!

వ్యాన్ బోల్తా

గోపాలపట్నం: పెందుర్తి నుంచి వస్తున్న పాల వ్యాను ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జి సెంటర్ డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలు ప్యాకెట్లు వేసేందుకు వచ్చిన వ్యాను తిరిగి వెళ్తున్న సమయంలో ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొట్టింది. పల్టీ కొట్టి రోడ్డుకు ఒక పక్కగా పడి పోయింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు, జనసంచారం లేక పోవడంతో పెను ప్రమాదమే తప్పినట్లయింది. వ్యాను డ్రైవర్‌కు కూడా ఎటువంటి గాయాలు కాలేదు. బుధవారం మధ్యాహ్నం వ్యానును రదారిపై నుంచి తొలగించి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.